# నీ కోసమే నువ్వు

"ఏరా గుంటా మీ గురువేడీ?"

ఆనందరావు ఆ బడ్డీ ముందు స్కూటర్ ఆపుజేసి అడిగేసరికి చటుక్కున లేచి నిల్చున్నాడు వాడు. ఇంట్లో అమ్మా అయ్యా పెట్టిన పేరేదో వున్నా చాలమంది ఆ పేరుతో పిలవరు. కొందరిలాగే 'గుంటా' అంటారు. కొందరు 'శిశువా' అంటారు. అతి కొద్దిమంది మాత్రమే 'వెంకటీ' అంటారు. పూర్తి పేరు వెంకటేశు. ఆ పేరు చెబితే అందరూ 'విజీసొంతేదిరా' అనడుగుతారు. అందుకే చెప్పడు. ఎలా పిల్చినా పలుకుతాడు.

వాడికి చదువు చెప్పిన గురువు నాలుగో క్లాసుతోనే ఆఖరైపోయాడు. మెకానిక్ పని నేర్పిస్తున్న సత్యమే అసలైన గురువిప్పుడు.

"గురూగారు ట్రైలెల్లేరండి. ఒచ్చేస్తారు కూచోండి" అన్నాడు హేండిల్‌బార్‌ను చేత్తో ఆప్యాయంగా తడుముతూ. గురువు లేనప్పుడు బేరాలొస్తే ఎలాగోలా కాయాలి గానీ 'లేదూ, మళ్ళీ రండి' అని చెప్పకూడదు. అది వాడు నేర్చుకున్న మొదటి పాఠం.

"మీ గురువుకి బండి చేతిలో వుంటే కాలు దురద పెడుతుంది- అందులోని

పెట్రోలు అయిపోయేవరకూ" అని బండికి స్టాండు వేసి సిగరెట్ ముట్టించేడు ఆనందరావు.

వెనక్కి వెళ్ళి ఓ పాత గాడ్రేజ్ కుర్చీ తెచ్చి ఫుట్‌పాత్ మీద వేసి, "కూర్చోండి సార్" అన్నాడు వెంకటి. ఆ కుర్చీ కూర్చోనే చోట ఎర్రరంగులోనూ, మిగతాదంతా ఆకుపచ్చ రంగులోనూ ఉంది. దానికున్న నాలుగు కాళ్ళలోనూ మూడు కాళ్ళే భూమ్మీద ఆన్తున్నాయి. ఒకటి మాత్రం రెండంగుళాల ఎత్తుకి వుండిపోయింది – దాని వంక ఓ మారు చూసి, "కుంతి కులాసం లాంటి మంచి ఆసనాన్నే సంపాదించేడు మీ గురువు" అన్నాడు ఆనందరావు.

ఆ మాటకి పళ్ళన్నీ బయటకు కన్పించేలా పకపకా నవ్వేడు వాడు. ఆ వెంటనే నవ్వాపుకుని "అదుగోనండి మా గురూగారు" అన్నాడు.

కత్తి లాంటి ఓ కట్ కొట్టి, చక్‌మని బ్రేకేసి, ఆనందరావు ముందాగేడు సత్యం – "నమస్కారం సారూ" అంటూ.

"ఇదిగో ఇవాళ తెచ్చేను బండి. నువ్వు మార్చాలని చెప్పిన పార్టులూ కొని తెచ్చేను. నాకు సాయంకాలానికి బండి కావాలి" అన్నాడు ఆనందరావు.

సత్యం దానికి సమాధానం చెప్పలేదు.

"పార్టులు కొనేశారా? ఏవీ?" అన్నాడు.

"మార్చాలన్నప్పుడు మరాలస్యం ఎందుకని కొనేశాను. ఇదిగో. ఇది సస్పెషన్ కిట్టు. ఇది ఫ్రంటు జోకరు – ఇదిగో యిది హెడ్ లైట్ స్విచ్చి" అంటూ ఒకటీ ఒకటీ బేగులోంచి తీసి బయటపెట్టేడు ఆనందరావు.

"చంపేసినారే – స్విచ్చి యిదిచ్చేడా? సోల్డరింగూ అదీ బోల్డు పని దీంతో" అన్నాడు హెడ్ లైటు స్విచ్‌ని పరికించి చూసి.

ఆనందరావేం మాట్లాడలేదు.

'పార్టులేవో నువ్వే కొని వేసీ' అంటే ఎక్కడ లేని హుషారు పుట్టుకొచ్చును. తను కొని తెచ్చాడు గనక కోటి వంకలు – అనుకున్నాడు.

"మరి బేరింగులేవీ" అడిగేడు సత్యం సామానంతా చూసి.

"అవి మార్చాలని నువ్వు చెప్పలేదుగా"

"బలేవోరే – ఇన్ని మారుస్తన్నాం అవి మార్చకపోతే నెల తిరక్కుండా దుకాణమెట్టేస్తాది" అని ఫ్రంటు వీల్‌ని అటూ యిటూ కదిలించి, "ఇటు చూడండి – ఎలా కదుల్తందో. మీ యిష్టం. అనక నే చెప్పలేదనకండి" అన్నాడు.

"మరప్పుడే ఎందుకు చెప్పలేదూ? డబ్బు చూసుకుని అన్నీ ఒకేమారు కొనేద్దునుగదా" – చికాకును ముఖంలో కన్పించనీయకుండానే అన్నాడు ఆనందరావు.

"బలేవోరే – మీరొచ్చి పదేను రోజులు దాటిందా? అప్పటికే అది డౌటుగా వుంది. ఎందుకులే అలా ఎడ్జస్టు చేసేద్దారనుకున్నాను. మీరు తిరిగేసేరు. మనూరి రోడ్లలా వున్నాయ్" అని వూరుకున్నాడు.

"అయితే ఏంటంటావ్?"

"మార్చుకుంటే మంచిది - మరో రెండేళ్ళ వరకూ బండి చూసుకోనక్కర్లేదు" అన్నాడు.

"సరే - నువ్వే కొని వేసెయ్. ఎంతవుతుందేమిటి?" అడిగేడు జేబులోకి చెయ్యి పోనిస్తూ.

"ఏమో. స్పేరు పార్టుల ధరలు రోజుకోలా వున్నాయి. ఒరిజినల్సు మరీనూ - అయినా దొరుకుతున్నాయో లేదో చూడాల" అని లేచి, అప్పుడే అక్కడాగిన మరో మోటార్ సైకిల్ బాబు వైపు చూసి, "నమస్తే సార్. దయలేదు" అంటూ అటు వెళ్లేడు.

అతగాడి మాటల్లోని రాజకీయం అర్థమైంది ఆనందరావుకి. ఏం చేయాలో పాలు పోలేదు. జేబులో రెండొందలున్నాయి. ఈ మధ్య బేరాల్లేక పై సంపాదన కూడా పడిపోయింది. వీడికేమో బండిని చూస్తే దాహం పుట్టుకొస్తోంది.

"అలాక్కానీండి సార్. మీర్రండి. నేను సెట్ చేస్తాగా మీరెళ్తే అలాగే అంటారు. మాకివ్వక తప్పదు. మీకిచ్చే రేటు కంటే ఓ పదో పాతికో తక్కువకే యిస్తారు మాకు. అడిచ్చే డిస్కౌంటేదో మాకు పడేశారనుకోండి. సంతోషిస్తాం. ఎళ్ళిరండి" అంటూ ఆ బేరాన్ని అక్కడ సెటిల్ జేసి.

"ఏటాలోచించేరు? మీరలా ఆలోచిస్తూంటే నాకలా బళ్ళు ఒచ్చేస్తుంటాయి. ఆనక అవలేదంటే దానికి మీదే బాధ్యత" అన్నాడు సత్యం ముఖానికి నవ్వు పులుముకుంటూ.

కాస్త పని నేర్చుకుని మెకానిక్ అయ్యేడు కాని ఆ సమయంలో ఏ నాయకుడి వెనకాలో తిరిగి ఉంటే యీపాటికి ఏ బడా రాజకీయనాయకుడో అయిపోను - అనుకున్నాడు ఆనందరావు.

"ఇదిగో యిందా - వంద. కొనాల్సినవేవో కొనేయ్. మిగతావి సాయంత్రం చూసుకుందాం. బండి మాత్రం సాయంకాలానికి రడీ చెయ్యాలి" అన్నాడు.

"అలాక్కానీండి" అంటూ వంద నోటును ముద్దెట్టుకొని జేబులో పెట్టుకుంటూ, "ఒరే గుంటా, బండి తీసి పుట్‌పాతెక్కించు" అంటూ ఆర్డరు జారీ చేసేడు.

పక్కనున్న బార్బర్ షాపులోంచి వస్తున్న కొత్త సినిమా పాటలో లీనమైపోయిన శిశువుకి గురువు కేక వినిపించలేదు.

"అదు చూడండి. అడి పోజూ ఆడూనూ. కిష్టదేవరాయల్లా ఆ టైర్ల సింహాసనం మీద కూసుని పాటలాలకిస్తన్నాడు - పాటలు" అని నవ్వి మరో కేక వేశాడు.

ఆ రెండో కేకకు తుళ్ళిపడి పరుగెత్తుకొచ్చేడు వెంకటి. అరవై రూపాయలకే ముప్పయ్ రోజులూ చేతులరిగేట్టు పనిచెయ్యాలి, వాడు గురువు దృష్టిలో అది పని చెప్పడం కాదు పని నేర్పించడం. ఉపాధి కల్పించడం.

"బాల కార్మికులంటూ బలే జాలి చూపిస్తారుగాని డబ్బు లేనోడు పస్తేసుకు బతకడంలో తప్పేటుందండీ? చిన్నా పెద్దా పనుల్జేసుకుంటేనే యీ మాయదారి రోజుల్లో కడుపుల్నిండేది - చదువెవడిగ్గావాలండీ చదువు" అన్నాడోమారు మాటొచ్చి అడిగితే-

"అన్నట్లు ఆయిలు ఓవర్ ఫ్లో అవుతోంది. అదీ చూడు" అన్నాడు, ఆనందరావు

స్కూటర్ తాళం చెవుల్ని సత్యాని కందిస్తూ.

అలాగే అన్నట్లు తల తాటించేడు.

సాయంకాలం ఆనందరావు వచ్చేసరికి అతగాడి స్కూటరు బడ్డీ ముందు పడుకోబెట్టి వుంది. – ఆపరేషన్ చేసే డాక్టరులా దాని ముందు కూర్చున్నాడు సత్యం పనిముట్లతో సహా.

'ఇంకా ఆపవలేదా' అని అడగలేకపోయాడు ఆనందరావు.

"ఇంకా ఎంతసేపవుతుంది?" అని మాత్రం అడిగేడు.

"అప్పట్నించి మీ బండితోనే కూచున్నాను. ఎలా తిరుగుతున్నారోగాని క్లచ్ ప్లేట్లు కూడా పూర్తిగా అరిగిపోయాయి. చూడండి" అంటూ నల్లగా జిడ్డోడుతున్న రెండు ప్లేట్లను చూపించేడు.

శిశువు గురువునీ, ఆనందరావునీ మార్చి మార్చి చూసేడు.

'అవి నా బండివే అని గేరంటీ ఏంవిటీ?' అని అడగలేదు ఆనందరావు. మనిషి మీద మనిషికుండే నమ్మకం అటువంటిది.

"ఏ రాతిరికైనా మీ బండి పూర్తిచేసిగానీ యింటికెళ్ళను" అన్నాడు సత్యమే.

"సరే రేపొస్తాను" అంటూ వచ్చేశాడు ఆనందరావు.

"పదో నెంబరు చీటీ ఎవరూ?"

తను లేచి, పక్కనున్న ముసిలాడిని కూడా లేపి నిల్చోబెట్టి నెమ్మదిగా నడిపించుకొంటూ లోపలికి తీసుకువెళ్ళేడు సత్యం. ముసిలోడు సత్యం తండ్రి.

"ఏం పేరు?" అడిగేరు డాక్టర్ శాంతమూర్తిగారు.

"ముత్యాలండి"

"జబ్బెవరికి? నీకా, అతనికా?"

"ముసిలోడికేనండీ" చెప్పేడు సత్యం.

"మరతగాడిని మాట్లాడనీ"

కాస్త వెనక్కి తగ్గేడు సత్యం. శాంతమూర్తిగారు ముసిలోడి వంక తిరిగి బల్ల మీద కూర్చోమని చెయ్యి చూపిస్తే నెమ్మదిగా కూర్చున్నాడతడు.

"ఏంవిటీ బాధ?" అడిగేరు శాంతమూర్తిగారు సాధ్యమైనంత శాంతంగా, నెమ్మదిగా.

"ముసిలోడికి చెంవుడండీ" నెమ్మదిగా చెప్పేడు సత్యం.

ముఖం తిప్పకుండా కళ్ళతోనే సత్యం వంక చూసేరు శాంతమూర్తిగారు.

"మాటలొచ్చు గదా"

ఈ మారు సత్యం మాట్లాడలేదు. చిన్నగా తలూపేడు వచ్చన్నట్లు.

'మా బలేవోణ్ణే రికమెండ్ చేసేడు బావ' అనుకున్నాడు మనసులో.

సౌంజ్ఞలతోనే ప్రశ్నలడిగి ముసలాడి చేత మాట్లాడించేరు శాంతమూర్తిగారు.

ఆ తర్వాత రెండు చీటీల మీద ఏవేవో రాసి, "సూది మందు పడుతుందా" అని సత్యం వేపు తిరిగేరు.

సత్యం మౌనంగా ముసలాడి వంక చూసేడు.

"సూది మందు అతనికేలే. జవాబు నువ్వు చెప్పొచ్చు" అన్నారాయన మరో చీటీ అందుకుని రాస్తూ.

'ఈడెక్కడి డాక్టర్రా బాబూ. సిన్మాల్లో అల్లురామలింగయ్య కేరక్టర్లాగ. వైద్యమేమన్నా చేస్తాడో లేక మాటలతోనే రోగం కుదిర్చేస్తాడో!' అనుకున్నాడు.

సత్యం జవాబు చెప్పేక రాసిన చీటీల్ని అతనికందించారాయన.

"అన్నీ ఇంజక్షన్లేనాండీ" అడిగేడు సత్యం అమాయకంగా వాటి వంక చూస్తూ.

"ఇంజక్షన్లు అక్కర్లేదు. ఊరికే అడిగేనంతే. అవి లేనిదే అతగాడికి వైద్యం మీద నమ్మకం కుదర్దంటే అలాగే యిద్దాం"

"అబ్బే అదేం కాదండి" అంటూ తడబడ్డాడు సత్యం.

"ఈ రెండూ టెస్టులు. ఈ రెండూ మందులు. ఎదురుగ్గా వున్న హెవెన్స్ లాబ్స్‌లో టెస్టులు చేయించి రేపు చూపించు. మందులు మాత్రం పక్క షాపులో కొని తీసుకొస్తే ఎలా వాడాలో చెబుతాను" అంటూ పెన్ను ముడిచేసి బెల్లు కొట్టేరాయన – తర్వాతి రోగిని చూసే ప్రయత్నంలో.

శాంతమూర్తిగారి బిల్లు చెల్లించి బయట కొచ్చేడు సత్యం. జేబులో పది రూపాయలే మిగిలేయి. మందులు ఇరవై ఆర్రూపాయలౌతాయన్నాడు షాపతను చీటీ చూసి. టెస్టులకెంతవుతుందో మరి! ఎలా లేదన్నా మరో వందైనా కావల్సి వుంటుందనుకున్నాడు.

"డబ్బులు సరిపోలేదా? టెస్టులేవో కూడా ఉన్నట్లున్నాయి. ఇంటికెళ్ళి తెచ్చీ. ఈ లోగా మందులు తీసుంచుతా" అన్నాడు మందుల షాపతను బేరం మరో చోటుకి పోతుందేమోనన్న భయంతో.

సత్యం అతని వంకోమారు చూసి ముసలాడి వంక చూసేడు. మందుల షాపతనికి ఎలా అర్థమైందో మరి.... "ముసిలోడిని ఎవరూ పట్టుకుపోరుగానీ అతగాణ్ణి యిక్కడే కూచోబెట్టి నువ్వెళ్లిరా. డాక్టరుగారెళ్లిపోతే మళ్ళీ దొరకరు" అన్నాడు.

ఆ మాటలకి అతగాడి మీద పీకలమొయ్యా కోపమొచ్చింది సత్యానికి. అయినా తమాయించుకుని ఆలోచించేడు. ముసిలోడి ఒంటి మీద స్టెతస్కోప్ కాదుగదా, చెయ్యేనా వెయ్యకుండా నాలుగు ప్రశ్నలేసి ఐదు పదులూ లాగేశారు డాక్టరుగారు. సంపాదనంటే అలా గుండాల. రేపు సాయంత్రానికి సర్దుబాటు చేస్తానంటే ఉండాలేగాని, బావ యివ్వకపోడు! అది తప్ప మరో మార్గం కనిపించలేదు సత్యానికి.

ముసలాడిని మందుల షాపు అరుగు మీద కూచోబెట్టి బావింటికి బయల్దేరాడు సత్యం.

◆ ◆ ◆

టీవీలో ఏదో షాంపూ ప్రకటన కోసం విగ్గంతా విరబోసుకుంటున్న పాతికేళ్ళ

పడుచు పిల్ల వంక చూస్తూ డ్రెస్సప్ అవుతున్నారు శాంతమూర్తిగారు.

సరిగ్గా ఆ సమయంలోనే అక్కడికొచ్చారు సరిత, సౌమ్య.

"డాడీ ఇవాళ ఉదయం గుర్తు చేయమన్నావు గుర్తుందా"

అడిగింది ఒకరే అయినా ప్రశ్న యిద్దరిదీనూ.

"గుర్తుండేటట్లయితే ఎందుకు గుర్తు చెయ్యమంటానూ" అంటూ తన సహజ ధోరణిలో ఓ డైలాగు పారేసి వారి వంక చూశారాయన.

ఇద్దరి కూతుళ్ళకీ వయసులో తేడా ఏడాదే అయినా పెద్దది వాళ్ళమ్మ పోలికేమో మరీ పెద్దదాన్లానూ, చిన్నది పీలగా మరీ చిన్నదాన్లానూ కనిపిస్తారు.

"ఇంతకీ ఏఁవిటటా?"

బండి డ్రైవ్ చేస్తున్నట్లు యాక్షన్ చేసి చూపించింది ఇద్దరిలోనూ పెద్దదీ, ఇరవై ఏళ్ళ వయసుదీ అయిన సరిత.

"మీకు డ్రైవింగ్ నేర్పించడముందే..." అని ఏదో అనబోయి, అక్కడితో ఆపి, "సరే ఇవాళ చెబుతాన్లే" అంటూ ముందుకొచ్చిన పొట్టను కాస్త వెనక్కు లాగి, బెల్టుతో బంధించి, టక్ చేయడం పూర్తిచేశారు శాంతమూర్తిగారు.

"ఇద్దరికీనూ. మళ్ళీ చెప్పలేదంటావ్" అంది చిన్నమ్మాయి సౌమ్య.

'ఏడ్చేదానికి మొగుడొస్తే...' అనే సామెత గుర్తొచ్చి నవ్వుకుంటూ, "అలాగేలే తల్లీ" అంటూ సోఫాలో కూలబడ్డారాయన.

ఈ లోగా వీధి గుమ్మం దాటి లోపలకొచ్చిన కామేశం కాస్త దూరంలోనే ఆగిపోయి "నమస్కారం సార్" అన్నాడు.

"రావోయ్ రా - నీకెన్నేళ్ళూ" అడిగేరాయన.

కామేశం కాస్త తడబడి, "నలభై నాలుగు నడుస్తోందండి" అన్నాడు.

"ఇకనేం మరో వంద నడిపించేస్తావ్. తల్చుకోగానే ప్రత్యక్షమయ్యేవు - సినిమా దేవుళ్ళాగా" అన్నారు శాంతమూర్తిగారు నవ్వుతూ.

నవ్వు రాకపోయినా పళ్లికిలించేడు కామేశం. డాక్టరుగారు హాస్యచతురులని అతనికి తెలుసు.

శాంతమూర్తిగారు పగటి పూట పనిచేసే ఆసుపత్రిలోని ముగ్గురు లాబ్ టెక్నీషియన్లలో కామేశం ఒకడు. బ్లడ్ టెస్టులూ అవీ చేస్తుంటాడు. మనిషి కాస్త నెమ్మదస్తుడు - మెతక అని డాక్టరుగారి నమ్మకం.

"అర్జంటు పని తగిలింది సార్. రెండు రోజులు సెలవు కావాలి రేపట్నించీ" అన్నాడు కామేశం చాలా నెమ్మదిగా.

"సెలవు మాట తర్వాత. నాకు రెండు డ్రైవింగ్ లైసెన్సులు కావాలి. ఇవాళే" అన్నారు డాక్టర్‌గారు వెంటనే.

"తమకి కారు డ్రైవింగ్ లైసెన్సు ఉంది గదండీ" నసిగేడు కామేశం.

"మరో రెండుంటాయనీ" అని నవ్వి, "నాక్కాదులేవోయ్ మా పిల్లలకి. నీకు

తెల్సినాయనెవరో వున్నారన్నావుగా. ఏర్పాటు చేయించు. టెస్టులూ అవీ లేకుండా పర్మనెంట్ లైసెన్సులు చేతికి రావాలి. ఎంతో కనుక్కుంటే ఇచ్చేద్దాం" అన్నారు డాక్టరుగారు.

"అలాగే సార్" తలూపేడు కామేశం.

"నువ్వివాళ ఆ పని మీదే వుండు. ఆసుపత్రిలో పని వాళ్లిద్దరూ చూసుకుంటారి వాళ్లికి అయినా మన హాస్పిటల్లో టెస్టులు చేయించుకున్నవాళ్ళంతా మళ్ళీ సాయంత్రం హెవెన్స్ లాబ్స్‌కి వెళ్తున్నారట, రిజల్టుల్లో తేడాలుంటున్నాయని. కాస్త ఆ పనీ జాగ్రత్తగా చెయ్యండి" అన్నారు.

'చిత్తం. పగలు తమ దగ్గరకొచ్చిన పేషెంట్లు కూడా' అనబోయి ఆగేడు కామేశం.

"సరే వెళ్ళు" అంటూ కారు తాళాలు తీసుకుని లేచేరు శాంతమూర్తిగారు.

కామేశం ఎగిరి గంతెయ్యలేదుగాని అంత పనీ చేశాడు. మనసులో నిజానికి అతగాడికి ఆ రోజూ సెలవు కావాలి. అదిలా సిద్ధించింది. వెంటనే పబ్లిక్ టెలిఫోన్ బూత్ దగ్గరికెళ్ళి ఆనందరావు నెంబరుకి డయల్ చేశాడు.

"హలో... నేనూ కామేశాన్ని... నీకో బేరం. మా డాక్టరుగారమ్మాయిలకి రెండు పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్సులు కావాలి. అర్జంటుగా" అటుపక్క ఆనందరావు బుర్ర అర్జంటుగా పదును బారింది.

"అర్జంటంటే కుదర్దేమో. రోజులు పూర్వంలా లేవు. అయినా చూస్తాన్లే" అన్నాడు.

"చూస్తానంటే కుదర్దు. నా సెలవుకీ, యీ పనికీ లింకు పెట్టేడు. ఎంతవుతుందో చెబితే..."

ఎంతో... ఆనందరావు ఆలోచించి చెప్పేడు.

"మరీ రేట్లలా పెంచేస్తే ఎలా?"

"అన్ని రేట్లూ పెరిగేయి మరి! నీ సొంతానికైతే చెప్పు. వూరికే చేసిపెడతా. ఆయనగారికేం? రెండు చేతులతోనూ సంపాదిస్తున్నాడు. వీలైతే కాళ్లతో కూడా పోగెయ్యాలనే చూస్తున్నాడు. మేనల్లుడి చేత మెడికల్ షాపూ, బ్రదరిన్లా చేత క్లినికల్ ల్యాబూ పెట్టించేడు. మరి... ఆయనా, మనం ఉల్లిపాయలు అదే రేటుకు కొనుక్కోవాలి! కదా? అంచేత,పద్ధతుల్ని లెక్కజెయ్యకుండా కదలకుండా పనులు అయిపోవాలంటే ఆ మాత్రం అవుతుంది. అందులోనూ అర్జంట్ కేసూ" అన్నాడు ఆనందరావు.

కామేశం మరేం మాట్లాడలేదు.

ఆ సాయంకాలం ఆనందరావు చెప్పిందానికి ఓ వంద కలిపి డాక్టరుగారి దగ్గర తీసుకొని, "రెండ్రోజుల్లో వచ్చేస్తాయి" అని హామీ ఇచ్చి రెండు రోజులు సెలవు గ్రాంటు చేయించుకుని రైలెక్కేసేడు.

◆ ◆ ◆

"మీకు చెప్పిన టయాంకి బండి రడీ చేసేసేను. మీదే అలస్యం" అన్నాడు సత్యం గుడ్డతో హేండిల్ బార్‌ని తుడుస్తూ.

"అది సరే - ఈ బిల్లేమిటి? చాలమట్టుకి స్పేరు పార్టులన్నీ నేనే కొనిచ్చాను

గదా?" అనడిగేడు ఆనందరావు.

"నన్నేం చేయమంటారు. ఆ కాటికీ మీకు చెప్పే వేసేను. మరి అయిల్ మార్చడం; సైలెన్సరు డీకార్బనైజ్ చెయ్యడం, తప్పనిసరై పోయింది. చేసినప్పుడు సుబ్బరంగా చెయ్యాల. అదీ నా పాలసీ."

"మరీ ఐదొందల తొంభయ్యా - జోళ్ళ షాపు వాడి రేటులా"

"మరేటి సెయ్యమంటారు. బిల్లు కూడా వుంది చూపిస్తాను"

'బిల్లులకేం నాయనా పిల్లిని కొన్నట్టు కూడా బిల్లును సంపాదించే రోజులివి' అనుకున్నాడు ఆనందరావు.

"మరందులోనే నా కూలి కూడా నూటేబై వేసేను. రెండ్రోజులు పూరాగా మీ బండి మీదే పన్జేసేను. ఆ మాత్తరమైనా లేకపోతే మేమెలా బతకాల? తగ్గిస్తే అందులోనే ఐదో పదో తగ్గించుకోండి" అన్నాడు సత్యవంతుడి తమ్ముళ్లా.

"నీ పది నేనెందుకుంచుకోవాలి. మరో పది నువ్వే తీసుకో" అంటూ ఆరొందలు లెక్క పెట్టి అందిస్తూ, "సంవత్సరంలోగా ట్రబులేమైనా వస్తే మరి నువ్వే చూడాలి ఫ్రీగా" అన్నాడు ఆనందరావు.

"మా బాగా అన్నారండి. భగవంతుడిచ్చిన ఒరిజినల్ పార్టులకే గేరంటీల్లేక డాక్టర్ల చుట్టూ తిరుగుతన్నం" అంటూ అదోలా నవ్వేడు సత్యం.

అప్పుడతనికి శాంతమూర్తిగారే గుర్తొచ్చేరు.

ఆనందరావుకీ డాక్టరుగారే తలపులో కొచ్చేరు.

"డాక్టర్ల దగ్గరా, మెకానిక్‌ల దగ్గరా వెళ్ళొస్తా అని చెప్పగూడదు. వెళ్తా మరి" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయేడు ఆనందరావు.

అతగాడు వెళ్ళిపోయేక పెళపెళలాడుతున్న పన్నెండు యాభై రూపాయల నోట్లనీ మరోసారి లెక్కెట్టుకుంటూ దూరం నించి వెంకటి తనను పరీక్షగా చూస్తుండడం గమనించి, కాస్త తడబడి -

"ఏట్రా ఏటీ? ఏటి జూస్తన్నావ్ - పాతికో ముప్పయ్యో వేలెట్టి బళ్ళు కొంటారు- పెట్రోలు లీటరు ముప్ఫయ్ అయినా పోయించుకు తిరుగుతారు. ఫేన్ల కింద కూచుని వేలు సంపాదిస్తారు. ఎండనక వాననక కష్టపడే మెకానిక్ గాడికో వంద పారేయాలనుకోరు. అంచేత..... మనకి మనమే సంపాదించుకోవాల. నేర్చుకోరా శిశువా" అంటూ ఎడం చేత్తో వాడిని మరింత దగ్గరకు రమ్మని పిలిచి, చొక్కా జేబులోని అరడజను అతుకుల్తో వున్నా చెలామణీ అయిపోతూన్న రెండు రూపాయల నోటును తీసి వాడి చేతిలో పెట్టి "ఎళ్ళి టీ తాగు" అన్నాడు. ✽

● రచన జన్మదిన ప్రత్యేక సంచిక - ఫిబ్రవరి - 1999